క్లుప్తంగా

నూకాలమ్మ ఆలయానికి విరాళం

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జాము నుంచే భక్తులు విశేష సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధికి హైద్రాబాద్‌కు చెందిన గూడవల్లి గోవిందరాజులు, నాగవేణి దంపతులు రూ.10,116 విరాళంగా అందజేశారని ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు.

20 నుంచి మహాపాదయాత్ర

కుక్కునూరు: పోలవరం నిర్వాసితుల సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో జూన్ 20 నుంచి జూలై నాలుగు వరకు మహాపాదయాత్ర నిర్వహించనున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. మహాపాదయాత్ర విజయవంతం కోరుతూ కుక్కునూరు మండలం దామరచర్ల గ్రామంలో శుక్రవారం పోలవరం నిర్వాసితుల పోరుకేక వాల్‌పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యర్నం సాయికిరణ్, మేడిపల్లి బాబు,బుయ్యన శ్రీను, రామల్ల గాంధీ, గోలి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి గణపవరం సెక్టార్ పరిధిలో జన్ భాగీదారి



అంతర్వేదిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డి గణపవరం సెక్టార్ పరిధిలోని అంతర్వేదిగూడెం, మర్లగూడెం, రెడ్డి గణపవరం గ్రామాల్లో శుక్రవారం జన్ భాగీదారి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జోడే సత్యదుర్గాప్రసాద్ మాట్లాడుతూ పిల్లల జీవితంలో మొదటి ఆరేళ్లు అత్యంత విలువైందన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ఇ.తులసి, సూపర్ వైజర్ జి.విజయకుమారి, ఏఎన్ఎం కె.శైలజ, అంగన్‌వాడీ వర్కర్స్ డి.సుదేష్ణ, పి.బేబి, అక్కమ్మ, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ ఈఈ (ఆపరేషన్స్)గా రాధాకృష్ణ



ఈఈగా బాధ్యతలు స్వీకరించిన రాధాకృష్ణ

జంగారెడ్డిగూడెం: ఏపీ ఈపీడీజీఎల్ జంగారెడ్డిగూడెం విద్యుత్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్స్)గా పి.రాధాకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈఈగా పనిచేసిన కేఎం అంబేద్కర్ రాజమండ్రి డీపీఈ/డీఈగా బదిలీపై వెళ్లారు. గతంలో చింతలపూడి ఏడీఈగా విధులు నిర్వహించిన రాధాకృష్ణ పదోన్నతిపై రాజమండ్రి డీపీఈ/డీఈగా వెళ్లిగా వెళ్లారు. అక్కడి నుంచి ప్రస్తుతం జంగారెడ్డిగూడెం బదిలీపై వచ్చారు. విద్యుత్ సమస్యలను సిబ్బంది సహకారంతో సత్వర పరిష్కారానికి కృషిచేస్తామని రాధాకృష్ణ తెలిపారు.

77 మంది దివ్యాంగుల గుర్తింపు



దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం

చింతలపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన శిబిరంలో మొత్తం 77 మంది దివ్యాంగులకు వివిధ పరికరాలు అవసరమని గుర్తించామని జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. దివ్యాంగులు తమకు అవసరమైన పరికరాలను తీసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా ఆడియోలజీ, సైకాలజీ, ఫిజియోథెరపీ, పీఅండ్ఓ యూడీఐడీ సేవలు అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ కామేశ్వరి, దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది జి.రాంబాబు, కె.నాగరాజు, కె.జయలక్ష్మి పాల్గొన్నారు.

నారసింహుడికి ప్రదోషకాలాభిషేకం



నారసింహుడికి నక్షత్ర హారతులిస్తున్న అర్చకుడు ఈశ్వర శర్మ

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత ఆలయం ఐఎస్ జగన్నాథపురంలోని సుందర గిరిపై కొలువైన లక్ష్మీ నారసింహ స్వామివారి ఆలయంలో చతుర్దశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి ప్రదోషకాల అభిషేకం నిర్వహించారు. అర్చకుడు కోడూరి ఈశ్వర శర్మ విష్వక్సేన పూజ చేశారు. వేద మంత్రోచ్చరణలతో స్వామివారికి పంచామృతాభిషేకాన్ని నిర్వహించి, నక్షత్ర హారతులిచ్చారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలను సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

భానుడి భగభగలు.. ప్రజల బెంబేలు



ఉదయం 9 గంటలకే నిర్మానుష్యంగా ఉన్న చింతలపూడి - ఏలూరు ప్రధాన రహదారి, (అంతర చిత్రం) డాక్టర్ కిరణ్ చైతన్య

చింతలపూడి: జూన్ నెలలో కూడా ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఒకపక్క భూమిలో నుంచి వచ్చే సెగలు, మరో పక్క పై నుంచి కాల్చేసే ఎండ వేడితో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. జూన్ మొదటి వారంలోనే రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయని వాతావరణ నిపుణులు ప్రకటించడంతో ఊపిరి పీల్చుకున్న ప్రజలు రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరిగి పోతుండటంతో తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. మెట్ట ప్రాంతంలో ఒక్కసారిగా పెరిగిన ఎండలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉదయం 8 గంటల నుండే ప్రజలు సూర్య తాపాన్ని తట్టుకోలేక పోతున్నారు. 38 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు నానా తంటాలు పడుతున్నారు. కొందరైతే ఎండలకు భయపడి ఇళ్ల వద్దే కాలం గడుపుతున్నారు. ఎండలకు మధ్యాహ్నం వేళల్లో రోడ్లపై జన సంచారం అంతగా కనిపించడం లేదు. ఒకవేళ బయటకొస్తే పండ్ల రసాలు, కొబ్బరి బొండాలు, చెరుకు రసం, చల్లని శీతల పానీయాలు సేవించి సేదదీరుతున్నారు. రోడ్లు మండుతున్న కొలిమిలాగ మారడంతో వాహనదారులు పగటి పూట చుక్కలు చూస్తున్నారు.

వడ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు

- మండుతోన్న ఎండల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ కిరణ్ చైతన్య సూచిస్తున్నారు. తొలకరి వానలు కురవడం ప్రారంభమైతే ఎండలు తగ్గుముఖం పడతాయి. అప్పటి వరకు ప్రజలు ఎండల్లో తిరక్కుండ జాగ్రత్తలు వహించాలి.
- వీలైనంత వరకు పసి పిల్లలను, వృద్ధులను ఎండలో తిరగనీయవద్దు. గాలి ఆడే చల్లని ప్రదేశాల్లో ఉండాలి. నీరు ఎక్కువగా తాగాలి.
- స్థూల కాయులు, మద్యం ఎక్కువ సేవించేవారు, జ్వరం, విరేచనాలతో బాధపడుతున్న వారు వడ దెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువ. వీరు ఎండలోకి వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- బిగుతుగా ఉండే దుస్తులు ధరించ వద్దు.
- ఎండ ఎక్కువగా తగులుతూ, గాలి అందని చోట పనులు చేయకూడదు. ఉదయం 11 గంటల లోపు, సాయంత్రం 4 గంటల తరువాత పనులు చేసుకోవడం మంచిది.
- ఎండాకాలంలో నల్లని దుస్తులు, ముదురు రంగు దుస్తులు ధరించ వద్దు. తెల్లని లేత రంగు దుస్తులు ధరించాలి. నైలాన్, టెర్లిన్, టెరికాట్ దుస్తులు ధరించ వద్దు. కాటన్ దుస్తులు ధరించడం మంచిది.
- పసిపిల్లలకు ఉదయం నుంచి సాయంత్రం వరకు తడిగుడ్డతో తరచూ తుడుస్తూ ఉండాలి. బయటకు తీసుకు వెళ్లేటప్పుడు గొడుగు రక్షణగా వేసుకోవాలి.
- ప్రతి రోజూ రెండు పూటలా స్నానం చేయాలి. తేలికగా అరిగే ఆహారం తీసుకోవాలి. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.

ఈ వారం రోజుల్లో మెట్ట ప్రాంతంలో నమోదైన ఉష్ణోగ్రతలు	
సోమవారం	42 డిగ్రీలు
మంగళవారం	41 డిగ్రీలు
బుధవారం	42 డిగ్రీలు
గురువారం	42 డిగ్రీలు
శుక్రవారం	42 డిగ్రీలు

యూనియన్ బ్యాంకులో కస్టమర్లకు వెతలు



కొయ్యలగూడెం యూనియన్ బ్యాంకులో అవస్థలు పడుతున్న బ్యాంకు కస్టమర్లు

కొయ్యలగూడెం: స్థానిక యూనియన్ బ్యాంకులో కస్టమర్ల వెతలు వర్ణనాతీతం. ప్రస్తుత ఎండలకు విద్యుత్ కోతలు తోడుకావడంతో ఉక్కపోతతో బ్యాంకు కస్టమర్లు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. యూనియన్ బ్యాంకులో ఆంధ్ర బ్యాంకు శాఖను విలీనం చేయడంతో కష్టమర్ల రద్దీ ఎక్కువైంది. బ్యాంకు సేవల నిమిత్తం వెళ్లిన కస్టమర్ ఆరు గంటల వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గత 10 రోజుల నుంచి కస్టమర్ల రద్దీ కొనసాగడంతో వృద్ధులు, మహిళలు సొమ్మసిల్లి పడిన ఘటనలు కొనసాగుతున్నాయి. ఉన్నతాధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కస్టమర్లు కోరుతున్నారు.

మండలాభివృద్ధికి కృషి చేద్దాం

లింగపాలెం: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషిచేద్దామని వైస్ ఎంపీపీ మట్టా సురేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈనెల 23 నుంచి ప్రారంభం కానున్నా జగనన్న సురక్షా పథకం ద్వారా గ్రామాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు అందించనున్నట్టు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని, వారికి అందుబాటులో ఉంటూ సేవలందించాలని అధికారులు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బందికి సూచించారు. ఎంఈఓ రామారావు మాట్లాడుతూ మండలంలోని 4,129 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశామన్నారు. బ్యాగులు రావాల్సి ఉందని చెప్పారు. తహసీల్దార్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈనెల 23 నుంచి ప్రారంభమయ్యే జగనన్న సురక్షా పథకం కార్యక్రమంలో ప్రజలకు పథకాలు వివరించడంతోపాటు వారి సమస్యలు పరిష్కరించనున్నట్టు తెలిపారు. ఏఓ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈనెలాఖరు వరకు కౌలు కార్డులు అందజేస్తామన్నారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి, ఆర్‌డబ్ల్యూఎస్, ఈఈ బి.వెంకట గిరి, ఎంపీడీఓ ఎస్ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ-2 కర్లపూడి జాన్సి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హనుమాన్ సీటు



థియేటర్‌లో ఏర్పాటుచేసిన హనుమాన్ సీటు

కొయ్యలగూడెం: ఆది పురుష్ సినిమా రిలీజ్ ప్రదర్శన సందర్భంగా శుక్రవారం మహాలక్ష్మి థియేటర్‌లో ఏర్పాటుచేసిన హనుమాన్ సీటు ప్రేక్షకులను ఆకర్షించింది. సినీ నిర్మాణ సంస్థ, అదేవిధంగా డిస్ట్రిబ్యూటర్ సూచన మేరకు సినిమా రిలీజ్ నుంచి థియేటర్లో ప్రత్యేకంగా సీట్ ఏర్పాటు చేసి హనుమాన్ ఫొటోతో కూడిన కాషాయ వస్త్రాన్ని వేసి ప్రతి షో ముందు పూజలు చేస్తున్నారు. ప్రేక్షకులు సైతం ఆ సీటులో ఎవరు కూర్చోకుండా గౌరవిస్తూ సహకరిస్తున్నారని మహాలక్ష్మి థియేటర్ నిర్వాహకులు పేర్కొన్నారు.

దుస్తుల పంపిణీ



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సీబీటీ ప్రిన్సిపాల్ శ్రీను

కుకునూరు: వింజరం ది కాలేజ్ ఆఫ్ బైబిల్ టెక్నాలజీ క్రైస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో శుక్రవారం వృద్ధులు, వితంతువులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మియాపూర్ సీబీటీ ప్రిన్సిపాల్ కింగ్ శ్రీను మాట్లాడుతూ జయశాలి ట్రస్ట్ తరపున గతంలో కూడా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామని, మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.సుందర్ రావు, జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రజకులకు రక్షణ చట్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో రజకుల సంక్షేమానికి రజకుల రక్షణ చట్టం చేయాలని రాష్ట్ర రజక జన సంఘం కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఏటిగట్టులోని జిల్లా రజక సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజకులకు రాజకీయ అధికారంలో ప్రాతినిధ్యం కల్పించాలని, రక్షణ చట్టం చేయాలని, రజకుల పిల్లలకు పాఠశాలల్లో సీట్లు ఉచితంగా ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు, పక్కాగృహాల కేటాయింపులో రజకులకు ప్రథమ స్థానం ఇవ్వాలని, 50 ఏళ్లు నిండిన రజకులకు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. రజక వృత్తి చెరువులపై శాశ్వత హక్కు కల్పిస్తూ కొత్త జీఓలను జారీ చేయాలని, రజకుల విశ్రాంతి భవనాల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని, దోబీగాట్స్‌కు రూ.10 లక్షల మంజూరు జీఓను అమలు చేయాలని, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు రూ.20 కోట్లు నిధులు విడుదల చేయాలని తీర్మానించారు. సమావేశంలో జిల్లా యువజన కార్యదర్శి విశాల శ్రీనివాసరావు, వట్లూరు మురళి, జిల్లా నేతలు కడెల్లి సుబ్బారావు, కొనిజర్ల నాగేశ్వరరావు, జువ్వలపాలెం సత్యానారాయణ, జాలిపూడి శేషు, అవిడ సుబ్రహ్మణ్యం, లక్ష్మీప్రసన్న, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం జగన్ కృషి



విద్యా కిట్లు పంపిణీ చేసిన నర్సింహారావు

లింగపాలెం: జగనన్న ప్రభుత్వం పేద విద్యార్థుల విద్య, వారి ఉన్నతికి పాటు పడుతోందని పార్టీ సచివాలయ కన్వీనర్ మందలపు నర్సింహారావు అన్నారు. శుక్రవారం కె.గోకవరం హైస్కూల్‌లో జేవీకే కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు ఎం.చంటియ్య, హెచ్ఎం బి.వెంకటేశ్వరరావు, నాయకులు కె.రఘు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో పుదుచ్చేరి చీఫ్ సెక్రటరీ



రాజీవ్ వర్మకు శ్రీవారి మెమెంటోను అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని పుదుచ్చేరి ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రాజీవ్ వర్మ శుక్రవారం సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ ఎం.విజయరాజు స్వామివారి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు.

నూతన ఒరవడులకు మూలం విజ్ఞాన శాస్త్రం

జంగారెడ్డిగూడెం: మానవ జీవితంలో నూతన ఆవిష్కరణలకు మూలాధారం విజ్ఞాన శాస్త్రం అని రామచంద్రపురం పాలిటెక్నిక్ కళాశాల ఫిజిక్స్ అధ్యాపకుడు ఎస్.రామారావు అన్నారు. స్థానిక సీఎస్‌టీఎస్ కళాశాలలో శుక్రవారం భౌతిక శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో విజ్ఞాన శాస్త్రం - ఆధునిక పోకడలు అనే అంశంపై ఏర్పాటుచేసిన సదస్సులో రామారావు మాట్లాడారు. ఆధునిక కాలంలో విజ్ఞాన శాస్త్రంలో తెలుసుకోవాల్సిన విజ్ఞానాన్ని, వాటిని గుర్తించే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాదబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.

సజ్జలకు సత్కారం

ఏలూరు (టూటౌన్): ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆయన్ని ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు పెరికే వరప్రసాదరావు గజమాలతో సత్కరించారు. తాడేపల్లిలోని రామకృష్ణారెడ్డిని శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బడుగు రామకృష్ణ, భీమేష్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రి ఎంట్రప్రెన్యూర్‌తో వ్యాపార అవకాశాలు



అగ్రి ఎంట్రప్రెన్యూర్‌లకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: అగ్రి ఎంట్రప్రెన్యూర్ (ఏఈ)గా మారడం ద్వారా మంచి వ్యాపార అవకాశాలను పొందవచ్చని జంగారెడ్డిగూడెం వ్యవసాయాధికారి ఎంపీ పోశారావు, బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ప్రసన్నలక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం రైతు భరోసా కేంద్రంలో ఏఈజీఎఫ్, సింజన్‌టా ఫౌండేషన్ ప్రాజెక్టు లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటిగ్రేషన్ ఆఫ్ బిజినెస్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. అగ్రి ఎంట్రప్రెన్యూర్‌లను ఉద్దేశించి వారు మాట్లాడుతూ రైతుల కోసం భూసార పరీక్షలు, డ్రోన్ ట్రైనింగ్, వివిధ అగ్రిలోన్స్ గురించి, క్రిమ్స్ గురించి వివరించారు. సింజెన్‌టా ప్రతినిధి ఎస్.రామారావు మాట్లాడుతూ ఏఈలకు ఉన్న వ్యాపార అవకాశాలను తెలియజేశారు. ఈ సందర్భంగా రైతులకు సేవలు అందించిన ముగ్గురు అగ్రి ఎంట్రప్రెన్యూర్‌లకు సింజన్‌టా ఫౌండేషన్ ఇండియా, ఏఈజీఎఫ్ ఆధ్వర్యంలో అందించిన ల్యాప్‌టాప్‌లను అందించారు. ఎస్ఎఫ్ఐ (ఏఈజీఎఫ్) జిల్లా మేనేజర్ ఎం.విజయ్, ఏఈలు, రైతులు పాల్గొన్నారు.

విత్తనాల షాపుల్లో తనిఖీలు



కొయ్యలగూడెంలోని ఒక విత్తన దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

కొయ్యలగూడెం: విత్తన షాపుల్లో వ్యవసాయ శాఖ ఏడీఏ పీజీ బుచ్చిబాబు ఏఓ చెన్నకేశవులతో కలిసి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొయ్యలగూడెం, కన్నాపురం, పొంగుటూరు, దిప్పకాయలపాడు గ్రామాల్లో విత్తన షాపుల్లో నాణ్యతా ప్రమాణాల నిమిత్తం 16 విత్తన నమూనాలను సేకరించారు. మండలంలో సుమారు 15 మంది డీలర్ల వద్ద 1086 క్వింటాల్ వరి విత్తనాలు వివిధ రకాలు ఉన్నాయని తెలిపారు. రైతులంతా తప్పనిసరిగా విత్తన కొనుగోలుపై బిల్లు రసీదు తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాపుల వద్ద విత్తన రకాల వివరాలతో కూడిన బోర్డును, రికార్డులను అమలు చేయాలని ఆదేశించారు.

19న ముత్యాలమ్మకు జలాభిషేకం

జంగారెడ్డిగూడెం: పట్టణ ప్రజలు ఆనంద సుఖసంతోషాలతో ఉండాలని, సకాలంలో మంచి వర్షాలతో రైతులు పాడిపంటలతో ఉన్నతమైన జీవితం పొందాలని కాంక్షిస్తూ ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద వేంచేసియున్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి జలాభిషేకం నిర్వహించనున్నట్టు ఆలయ నిర్మాణకర్త భవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతులు తెలిపారు. ఆలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారిని, అనంతేశ్వర స్వామిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. జలాభిషేక మహోత్సవంలో భక్తులంతా పాలుపంచుకోవాలని కోరారు. కనుపర్తి దన కుమార్, వెల్డింగ్ రంగ దంపతులు, కార్పెంటర్ నాగరాజు దంపతులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

బుట్టాయగూడెం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీఓ ఇ.తులసి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుట్టాయగూడెం మండలం నూతిరామన్నపాలెం, రామన్నగూడెం గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, బుట్టాయగూడెం-4, కండ్రికగూడెం, రాగప్పగూడెం, వెల్తురువారిగూడెం, జైనవారిగూడెం, ఇనుమూరు గ్రామాలు, అలాగే.. జీలుగుమిల్లి మండలం దర్భగూడెం-2, లక్ష్మీపురం-1 దర్భగూడెం-3 అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ పోస్టులకు గిరిజన వివాహిత మహిళలు మాత్రమే అర్హులని, స్థానికులై ఉండాలని, 2023 జులై ఒకటో తేదీ నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల్లోపు వయస్సు ఉండాలని వివరించారు. కనీస విద్యార్హత పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, అదనపు విద్యార్హతలకు ప్రాముఖ్యత ఉంటుందని తెలిపారు. ఈ నెల 22న సాయంత్రం ఐదు గంటల్లోపు బుట్టాయగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని తులసి పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై హర్షం



నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్

పెదపాడు: నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో లోఓల్టేజీ సమస్య తీరనున్నట్లు పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ తెలిపారు. పెదపాడు మండలంలోని వీరమ్మకుంట గ్రామ పంచాయతీ శివారు వెంకటాపురంలో ఇటీవల ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారని తెలిపారు. విద్యుత్ సమస్యలు లేకుండా 63 కేవీ విద్యుత్ టాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసామని చెప్పారు. ఆర్వో వాటర్ ప్లాంటు పూర్తవుతోందని రాజశేఖర్ హామీ ఇచ్చారు.

పేదలకు మెరుగైన విద్యకు ప్రభుత్వం కృషి



విద్యార్థులను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

పెదపాడు: రాష్ట్రంలో విద్యారంగాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆణిముత్యాలు పురస్కారాల ప్రదానం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన ముగ్గురు విద్యార్థులను చైర్ పర్సన్ సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో చైర్ పర్సన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ విద్యారంగంలో జగనన్న విప్లవాత్మక పథకాల కారణంగా స్కూళ్లు నేడు విద్యార్థులతో కళకళలాడుతున్నాయని చెప్పారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు స్కూల్‌కు అవసరమైన ప్రహరీ, సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు. బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఏలూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్య, వైద్యం పైనే ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి మాట్లాడుతూ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రణాళికాబద్ధంగా నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు చెప్పారు. గురుకుల పాఠశాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని చెప్పారు. వట్లూరుకు చెందిన పసుపులేటి గాయత్రి 590 మార్కులతో జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించిందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ బాలికను అందరూ అభినందించారు. అనంతరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను చైర్‌పర్సన్ ఘనంగా సన్మానించారు. వారికి నగదు బహుమతి, మెడల్స్, మెరి ట్ సర్టిఫికెట్లు అందించారు. ఎంపీపీ బత్తు ల రత్నకుమారి, బత్తుల ఏసురాజు, ఎంపీడీఓ ఎస్ నిర్మలజ్యోతి, తహసీల్దార్ జీ విజయ కుమార్‌రాజు, సర్పంచ్ రత్నకుమారి, ప్రిన్సిపాల్ మేరీ ఝాన్సీరాణి పాల్గొన్నారు.